శ్రీపతి మనసు మనసులో లేదు. ఎక్కడ వుందో అతనికి తెలియదు.

ఉదయం మామూలుగానే లేచాడు. కాని కాస్త ఇబ్బందికంగాలనిపించింది. జేబునిండుగా డబ్బు లేక పోతే వంట్లో ఇబ్బందికంగా వుంటూవుండటం అప్పుడప్పుడూ మామూలే. అసలనే ఈ అస్వస్థత గురించి ఎక్కువగా ఆలోచించకుండానే బజారుకు బయలు దేరాడు.

ఏమీ తోచకుండా వుండి, ఏమీ తెలియకుండా వుండి, ఎరిగినవాళ్లతో ఎవరితోనయినా కబుర్లు చెబుతూ కూర్చుంటే కాస్త హాయిగా వుంటుందేమో ననిపించింది. రంగారావు ఇంటికి వెడదామనుకున్నాడు. కాని ఎక్కడ రంగారావుఇల్లు? వెళ్లటానికే అరగంట పైగా పడుతుంది. తీరావెళ్లితే అతగాడు ఇంట్లోనే వుంటాడని గ్యారంటీ లేదు. అయినప్పుడు వెళ్లటమా, మానటమా? ఏమీ తోచని అయోమయంలోపడి కొట్టుకోవడంకంటే వెళ్లితేనే బాగుంటుందని అతడి మందమైన అల్పబుద్ధికి తోచింది. కనుక వెంటనే వెళ్లాలనే తీర్మానం చేసుకున్నాడు.

కాస్తమేర నడిచాడు. కాని నడవడంకంటే ఏదన్నా రిక్షా ఎక్కి వెడితే బాగుంటుందని తోచింది. ఏమీ తోచకుండా వున్నప్పుడు మనసుకు ఇలాంటి దండగమారి పనులే పదే పదే తోస్తూ వుంటాయి. మామూలే!

ఎవరినయినా పలకరించవచ్చును కాని రామ రామ! —ఈ రిక్షావాళ్లు ఈ మధ్య మరీ బరితెగించి పోయినారు. వీళ్లలోనూ సంఘాలూ, కట్టుబాట్లు వెలిసినాయట! అన్ని రకాలవాళ్లలోనూ వున్నట్లు వీళ్లలోనూ రకరకాల వాళ్లున్నారు.

ఒక్కొక్కడు పిలిస్తేనే పలకడు. మరొకడు పిలవకపోయినా వెంటపడతాడు. వేరొకడు మధ్యే మార్గంగా వుంటాడు. అందుకనే శ్రీపతికి వాళ్లంటే తగని మంట.

పోతే రిక్షా ఎక్కడం వల్ల సాధించగల నదు పాయాలు కొన్ని వుండబట్టి ఆ పని మానేయ లేకుండా వున్నాడు. ఒకటి కాలాన్ని జయించటం, రెండు శరీరాయాసం లేకుండా వుండటం!

—దారి కడ్డువస్తున్న రిక్షావాడిని పిలిచాడు శ్రీపతి. 'వస్తావా?'

'ఎక్కడికి బాబూ!'

'సత్యనారాయణపురం'

'వస్తాను బాబు—'

'ఏం ఇవ్వమంటావు?'

'మీకు తెలీదా బాబూ—' వీళ్లకు ఇదో ఆదర్శం! ముందరి కాళ్లకు బంధాలు వేయటానికి ఇది మార్గం. అందుకే శ్రీపతికి మరీ చికాకు.

'పావలా ఇస్తాను—వస్తావా?'

'ఆరణాలు ఇప్పించండి బాబూ'

'లాభం లేదు—' నాలుగడుగులు ముందుకు వేశాడు శ్రీపతి

'సెంటరుకు వెడితే మూడణాలు ఇస్తారు బాబూ, మీరు ఏమిటో ఆలోచిస్తున్నారుగాని—' రిక్షావాడు తన దారినే వస్తూనే సణుగుతున్నాడు.

రిక్షావాడికి సెంటరుకు వెడితే మూడణాలు ఇస్తా రట! ఎవరో పూరికే—ఉత్త పుణ్యానికే ఇస్తారు కావును! అలాగయితే అక్కడికి వెళ్లక ఇక్కడెందుకు తచ్చాడుతున్నాడు—అనుకున్నాడు శ్రీపతి మనసులో.

ఇంతలో వాడు మళ్లీ అయిదణాలు ఇప్పించండి బాబూ!' అన్నాడు.

ఊహూ! పావలా అయితేనే!' అన్నాడు శ్రీపతి.

'రండి. కూర్చోండి.'

—తను ముందుగా అడిగినప్పుడే, ఈ బేరసారాలు లేకుండా ఎక్కించుకుపోతే వాడి పరువు ప్రతిష్ఠలకు భంగం కావును!—అనుకున్నాడు శ్రీపతి. వ్యాపార లక్షణంకదా బేరసారాలు! ఇంకా ఖచ్చితమైన పద్ధతిలో బతకటం నేర్చుకోలేదు కద—మనం అనిపిస్తుంది.

రిక్షా జోరుగా వెడుతోంది.

శ్రీపతి ఆలోచనలుకూడా జోరుగానే వెడు తున్నాయి. అయితే దేనివేగం ఎక్కువో అంచనా వేయగలగటం అంత తేలికయిన పనికానట్టుంది!

రంగారావు ఇంటిదగ్గర లేకపోతే ఈ పావలా శుద్ధ దండగ. ఈ పావలాయే కాకుండా తిరుగు ప్రయాణానికి అయే మరో పావలాకూడా దండగే! అయితే వాడు ఇంటిదగ్గర వుంటేమటుకు ఇది దండగ కాదా? ఏమిటో, వాడితో మాట్లాడుతూ వుంటే ఈ దండగంతా లాభం ఎట్లా అవుతుందో! కాని అట్లాగే అనిపిస్తుంది మనసుకు. ఎందుచేత?

అయితే రంగారావు ఇంటిదగ్గర వుంటాడో వుండడో! అక్కడకు వెళ్లకుండా, చూడకుండా తనకు తెలిసే మార్గంలేదు. ప్రపంచంలో ఏం జరుగు తున్నదీ ఎలా జరుగుతున్నదీ ప్రత్యక్షంగా చూస్తే తప్ప తనకు తెలియదు కదా! తనకు దివ్యదృష్టి లేదు. అదే వుంటే తను తన గదిలోంచి ఇవతలకు రానక్కర లేదు. పక్కదిగి కిందకు కాలు పెట్టనక్కరలేదు. అయితే అది తనకు లేదు. కనీసం దాన్ని సాధించే మార్గమన్నా ఎక్కడా తెలియదు.

వచ్చాం బాబూ! ఏ సందు తిప్పమంటాడు?'

శ్రీపతి ఉలిక్కిపడ్డాడు. ఇదే సందు సూటిగా పోనీ—'

రిక్షా రంగారావు ఇంటిముందు ఆగింది.

శ్రీపతి దిగాడు. పావలాతీసి రిక్షా మనిషికి ఇచ్చి లోపలికి వెళ్లాడు.

రంగారావు—రంగా...'

'ఓయ్—'

తలుపు తెరుచుకుంది. తను నిజంగా అదృష్ట వంతుడు! రంగారావు ఇంట్లోనే వున్నాడు

ఇద్దరూ లోపల కూర్చున్నారు.

ఏం, పొద్దున్నే వచ్చావు శ్రీపతి. ఏమిటి సంగ తులు?'

'ఏమీలేదోయ్. ఏమీ తోచక నువ్వేమయినా చెబు తావేమోనని వచ్చాను—'

నేనూ ఇప్పుడే లేచి కాఫీ తాగాను. రాత్రి ఓ చండా లపు సినిమాకు వెళ్లానులే. వచ్చేటప్పటికి రెండయింది!

ఏ సినిమా?'

రంగారావు చెప్పాడు.

ఏం బాగులేదూ?'

'పరమ చండాలంగా వుంది! అంత తుక్కు ఫిలిం నే నెక్కడా చూడ్లేదు!'

—రంగారావు ఏ సినిమా చూచివచ్చినా అలాగే అంటాడు. కాని ప్రతి సినిమా చూడటంమటుకు మానడు! అదో అలవాటు—కాకపోతే వ్యసనం వంటిది!

'తుక్కు సినిమాలకు తప్ప మనం ఇంక దేనికీ నోచుకోలేదేమోలే—'

'అట్లాగే అనిపిస్తోంది, ఈ రోజుల్లో!'

తరువాత సంభాషణ కొన్ని సాధారణ విషయాల మీద దొర్లింది.

ఇద్దరూ మళ్లీ కాఫీ తాగారు.

పది గంటలయింది.

శ్రీపతి వెడతానంటూ లేచాడు.

'ఏం తొందర?'

'తొందరేముంది? పది గంటలయిందిగా. భోజనం చేసి ఆఫీసుకు వెళ్లవద్దూ—'

'ఉండు నేనుకూడా అట్లా బజారుదాకా వస్తాను'

ఇద్దరూ కొంతదూరం నడిచారు.

శ్రీపతి, తర్వాత, ఒక్కడూ బయలుదేరాడు. మనసు ఒక దారికంటూ వచ్చినట్లయింది. ఏమీ లేదు, ఉదయమే ఏమీ తోచక—కోరుకున్న ఒక్కపని సవ్యంగా చేయగలిగాడు. అంతకంటే ఇంకేం కావాలి? ఏమీ అక్కర్లేదనే అనిపిస్తుంది ప్రస్తుతానికి. కాని కించిత్ దూరదృష్టితో చూస్తే ఏదో లోటు, లోపం అనిపించకపోదు. అదే స్పష్టంగా అర్థంకాదు. అదే అనుమానం, అవస్థ.

శ్రీపతి భోజనంచేసి హోటలుదాటి మళ్లీ బజా రుకు వచ్చేసరికి పదిన్నర అయింది. నింపాదిగా యింటినైపు నడిచాడు.

కాసేపు పడక కుర్చీలో జారగిలపడ్డాడు.

ఇంతలో వెంకటరత్నం వచ్చి పలకరించాడు. 'దా—పోదాం—'



శ్రమతో సంతోషం

—ఫోటో: శ్రీ ఎస్. ఎన్. పెండ్యాల

'ఎక్కడికి?'

'ఆఫీసుకు—'

'టైమెంతయింది?'

'అయిదు నిమిషాలు తక్కువ పదకొండు'

'అబ్బ! బద్ధకంగా వున్నట్లుందోయ్—వెడదా మంటావా?'

'ఊ—టైమయిపోతూవుంటే—'

శ్రీపతి మనస్సు ఏదో ఇదిగా తయారయినట్లయింది.

'ఈ పూట వంట్లో బాగులేదోయ్. రాను, సెలవు చీటీ ఇస్తాను, మానేజరు కివ్వు—'

అట్లాగేనని వెళ్ళిపోయాడు, వెంకటరత్నం.

తరువాత శ్రీపతికి అనవసరంగా సెలవు ఒకటి పాడుచేసుకుంటున్నట్లు అనుమానం వచ్చింది. కాని తనకు ఒంట్లో బాగుండనిమాట నిజమే! మనసు వ్యగ్రంగా వున్నమాట నిజమే!

అక్కడికి వెళ్ళినా ఏం చేయలేకపోవడమో, ప్రయత్నించి ఏమయినా చేసినా, సాయంత్రానికి జ్వరం వంటిది తగలడమో జరగవచ్చు. నివారణకన్న నిరోధమే మేలు కనక ఈ రోజంతా రెస్టు తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది! మనసుకుకూడా కొంత హాయి చేకూరుతుంది!

ఇట్లా అనుకుంటూనే శ్రీపతి నిద్రకు పడ్డాడు.

ఎంతోసేపు నిద్రపోవాలనే విషయం అతనేమి నిర్ధారించుకో లేదు గాని, మెలకువ వచ్చేసరికి మధ్యాహ్నం మూడు గంటలయింది! కళ్ళు తెరిచి చూడగానే కిటికీలో—టపాల బయటనుంచి పోస్టు మనిషి పడవేసి వుంటాడు—వుత్తరాలు రెండు కనిపించాయి. కమల దగ్గర్నుంచి ఒక వుత్తరం—'కులాసాగానే వున్నాను. ఆరోగ్యం బాగానే వుంది. మీరు కూడా ఇలాగే వున్నారనుకుంటాను—వెంటనే జవాబు వ్రాయండి.' అవి! ఇట్లా ఇంకా ఎన్నాళ్ళు వుత్తరాలు వస్తూనే వుంటాయో శ్రీపతికి అర్థం కాదు. ఇంకా కమలకు పురుడు వచ్చేదెప్పుడు?—పిల్లవాడికి మూడోనెల వచ్చే దెప్పుడు?—ఆమె మళ్ళీ తన దగ్గరకు వచ్చేదెప్పుడు—ఏమిటో—రోజులు మందంగా, నిస్తబ్దంగా గడిచిపోతున్నాయనిపిస్తుంది.

రెండో వుత్తరం స్నేహితుడు శివరాందగ్గర్నుంచి. 'ఎన్ని వుత్తరాలు వ్రాసినా జవాబయినా రాయవేం? నీ బద్ధకం పోయే వుపాయం లేదా? ఆఫీసులోకూడా ఇంతేనా నువ్వు? ఓరినీ! ఇంతకూ నేను పోయిన వుత్తరంలో వ్రాసిన విషయం ఏం చేశావ్? ఆ జయమతి వ్యవహారం యేదయినా పొసగేట్టు వుందా? వెంటనే జవాబు వ్రాయి. మూడోనాటికల్లా నీ వుత్తరం నా కందకపోతే నేనే బయలుదేరి వస్తాను—'

శ్రీపతి రెండు వుత్తరాలూ మడిచి గూట్లో పడేశాడు. జవాబు వ్రాద్దామనుకున్నాడు కాని ఏం రాయడం? కమలకు రాయక్కర్లేదు, సంగతులేమీ లేవు కనక. పోతే, శివరాంకు? వాడు లోగడ రాసిన వ్యవహారం ఏమిటో తనకు గుర్తు లేదు. ఇప్పుడు రాసి దానివల్లనైనా తను చేయగలిగేది వున్నట్టు కనిపించదు. ఏమయినా వాడి వ్యవహారం వాడే స్వయంగా చూసుకోవటం మంచిది! ఈ ముక్కే జవాబు రాసి పడేస్తే సరిపోతుందేమో! ఎట్లాగా, వాడే మూడో నాటికి వస్తానన్నాడుగా! అందుచేత తను వుత్తరం వ్రాయడంకూడా అనవసరమే! వాడు వచ్చాకనే, ముఖతః ఈ విషయం చెప్పవచ్చును.

శ్రీపతి లేచి ముఖం కడుక్కు కూర్చున్నాడు. ఇంతలో పనిమనిషి వచ్చింది. ఇల్లు పూడ్చి ఫ్లాస్కు తీసుకు బయలుదేరింది. 'కాఫీయేనా ఇంకేమయినా తెమ్మంటారా?'

'ఇంకేం తెస్తావు?'

'టిఫిన్ ఏమన్నా?'

'ఒద్దులే, ఒట్టి కాఫీ చాలు—స్ట్రాంగ్‌గా పట్రా' అంటూ రెండణాలు ఆ అమ్మాయి చేతిలో పడేశాడు.

అయిదు నిమిషాలు గదిలో అటూ ఇటూ పచారు చేసేటప్పటికి కాఫీ రానే వచ్చింది.

ఫ్లాస్కులోంచి గ్లాసులో పోసి కాఫీ బల్లమీద పెట్టింది పనిమనిషి.

విషంలాంటి కాఫీ త్రాగి శ్రీపతి సిగరెట్టు ముట్టించాడు. ఉంగరా లుంగరాలుగా పొగ వదలలేదు కాని చాలసేపు ఆలోచిస్తూ వుండిపోయాడు.

ఎండ మండిపోతోంది, బయట. అప్పుడే ఎండా కాలం మొదలయింది కాబోలు! అబ్బ! ఏం ఎండలు, దారుణమైన ఎండలు. బయటకు పో బుద్ధికాదు. ఇంట్లోనే వుంటే ఏమీ తోచదు.

సిగరెట్ కొన అవతలపారేసి శ్రీపతి పుస్తకాల బీరువాదగ్గరకు వెళ్ళాడు.

ఎన్నో పుస్తకాలు వున్నాయి. కాని అన్నీ లోగడ చదివేసినవే! ప్రతి కొత్త పుస్తకంకూడా తన చేతిలోకి రాగానే పాతదయిపోతోంది. కాకపోయినా, ఈ మధ్య ఎంత కొత్త పుస్తకం చదివినా ఇదివరకు చదివినట్లే వుంటోంది! ఎవరి ముఖం చూసినా ఇదివర కెప్పుడో, ఎక్కడో చూసినట్లే వుంటోంది! నిజానికి ఇంతకంటే ఎక్కువ పాపం లేదు.

శ్రీపతి పుస్తకాల దొంతరలన్నీ ఒకసారి సవరించాడు. నాలుగు పుస్తకాలు చేతపట్టుకుని పడక కుర్చీలో జారగిలబడ్డాడు. రెండు పేజీలు చూశాక, ఇంక ముందుకు సాగవ బుద్ధికావడం లేదు. అరగంట

కళ్ళా చదివే వ్యాపారానికి స్వస్తి చెప్పాల్సి వచ్చింది. తప్పనిసరిగా!

ఒక పుస్తకంలోంచి తెల్లటి కాయితం బయట పడింది. ఒళ్లోమీది పార్కర్ పెన్ను గుర్తుకు వచ్చింది. తెల్లకాయితంమీద తన పేరు రాశాడు. ఏవో పిచ్చి గీతలు గీశాడు. తెల్లటి కాగితం కాస్తా నానా అసహ్యంగా తయారయింది! నలిపి అవతల పారవేశాడు.

పోనీ కాస్సేపు రాసు కుందామనిపించింది. కాని ఏం రాసేట్టు? ఎట్లా రాసేట్టు? ఏం రాయటానికీ ఏమీ తోచడంలేదు కదా! పట్టుమని—కాగితంమీద కలంపెట్టి—పదిలైన్లు రాసి ఎన్నాళ్లయిందో కదా! ఈ మధ్య పొత్తిగా ఒక్క కథ కూడా రాసిన పాపాన పోలేదు. ఆ వుత్సాహం, ఓపిక, ఆసక్తి లేవు. మనసుకు రాయడం అంటే తీరని అసహ్యం కలుగుతోంది. పది లైన్లలో పరమార్థం పొత్తిగా దూరమవుతోంది. స్నేహితులు, తెలిసినవాళ్లు అదేపనిగా కనిపించి నప్పుడల్లా అడుగుతున్నారు: 'ఏం శ్రీపతీ, ఈ మధ్య ఎక్కడా నీ కథ కనబడటం లేదూ?'

'ఏమన్నా రాస్తూంటేగా!'

'ఏం, ఎందుకు రాయడంలా?'

'భావ దారిద్ర్యం పట్టుకుంది!'

'భలే వాడివేలే! నీబోటి యువకుడిని ఆ దారిద్ర్యం ఎప్పుడూ పట్టుకోదు!' అంటారు అందరూ. కాని తనకు ఎందుచేత ఏమీ తోచకపోవడం? ఎందుచేత తను ఎందుకూ కాకపోవడం?—అదే అర్థంకాదు. కానప్పుడు తను చెప్పేమాటలు నిజమేకదా! అక్షరాల నిజం—అనిపిస్తుంది.

ఆలోచిస్తూంటే పిచ్చివాడి మన స్థితికీ తన మన స్థితికీ తేడాలేదనిపిస్తుంది.

తనకు ఆలోచనలు ఎక్కువ. నిర్విరామంగా ఒక దానికంటే ముందు మరొకటి మెదడును అతలా కుతలం చేస్తున్నాయి. కాగా, ఇవన్నీ చాలా అస్తవ్యస్తంగాకూడా వున్నాయి. ఒక దానికీ మరో దానికీ పొంతన కుదరడంలేదు. వాటిని గుదిగుచ్చడం తనకు అసలే చేతకావడంలేదు. వాటితో తను ఎడ్జస్ట్ కాలేకపోతున్నాడు. తన ఆలోచనలన్నిటినీ తన మనస్సు ఎకామడేట్ చేయలేకపోతోంది. ఇదే అయివుండాలి తనలో లోపం. లేకపోతే ఏ ఆలోచనా ఎందుకు గుర్తు లేకుండా పోతుంది. కనీసం, రాత్రి కన్న కలలయినా, వాటిలో కనిపించిన విశేషాలయినా, ఎందుకు గుర్తు లేకుండా పోతాయి?

అవును! అవును! తను అనుకునేదంతా తప్పకుండా నిజమే. అందుకేమీ సందేహం లేదు.

కిటికీలోంచి బయటకు చూడగా, ఎండ తీవ్రత తగ్గిపోయినట్లయింది. టైం చూస్తే ఆరు గంటలు! అబ్బ పగలంతా అయిపోయింది. ఇక చీకటి. దీపాలు వెలిగించుకునే చీకటి మొదలవుతోంది. తెల్లవారితే మళ్ళీ కొత్త రోజు ప్రారంభం అవుతుంది:

పదకొండు నుంచి ఇంట్లో కూర్చుంటే విసుగ్గా వున్నట్లయింది. ఇంటిమీద విసుగు. బజారుకు వెడదామనిపిస్తోంది. ఎట్లాగూ ఇంకో గంటకయినా భోజనం మిషకు బయటకు వెళ్ళక తప్పదు కదా!

ముఖం కడుక్కుని దుస్తులు మార్చుకుని బయలు దేరాడు.

ఒకళ్లిద్దరు తెలిసినవాళ్ళు అగుపడ్డారు. లాంఛన ప్రాయంగా పలకరించారు. తనూ లాంఛనప్రాయంగా మాట్లాడాడు. అంతకంటే మరేం విపరీతం జరగ లేదు.

పెద్ద బజారు ఒకసారి చుట్టివచ్చేటప్పటికి ఏడున్నర గంటలయింది.

కడుపులో ఆకలి దహించుకుపోయినట్లయింది రోడ్డుమీది హోటల్ బోర్డు కనిపించేసరికి.

గబ గబ లోపలకు వెళ్ళి భోజనం కానిచ్చేశాడు. ఇప్పుడేం చేయాలి? తిరిగి ఇంటికిపోయి నిద్రపోవడం కంటే చెప్పుకోదగ్గ మరో పని ఏమీ కనిపించదు. ఇప్పుడే పోయి పడుకుంటే నిద్రపట్టి చావదుకదా! అందుకనే దార్లో కనిపించిన పుస్తకాల షాపులో దూరాడు. కనిపించిన పుస్తకాలన్నీ తిరగేశాడు. చివరకో కథల పుస్తకం తీసుకుని రోడ్డున పడ్డాడు.

వివిధ రచయితల కథల పుస్తకం అది! జీవితాన్ని వివిధ కోణాల్లో కొలిచే అనేక మంది రచయితలు విడి విడిగా రాసిన కథల్ని ఒకచోట చేర్చికూర్చిన పుస్తకం. కాని ఒక ధైర్యం మటుకు శ్రీపతికి వుంది! ఏమంటే ఏ రచయితకూడా జీవితాన్ని తనలాగ దారుణమైన కోణంలో కొలవడు. తనలాగ అన్యాయం చేయడు. జీవితం తనను అన్యాయం చేస్తుందన్న మిషతో, జీవితాన్ని అన్యాయం చేయబూనుకునే అవివేకానికి దిగడు.

శ్రీపతి ఇంటికి చేరుకున్నాడు.

బెడ్ లైట్ వెలుగులోనే కొత్త పుస్తకాన్ని చదవడం మొదలెట్టాడు.

కాని, ఎంతవరకు చదివాడో అతనికి తెలీదు. ఎప్పుడు అకస్మాత్తుగా నిద్రకుపడ్డాడో అంతకన్నా తెలీదు! ★



సోల్ ఏజంట్లు : దాదా అండ్ కో., 86, నైనియప్పన్ నాయక్ వీధి, మద్రాసు—౧.